క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో వసతులు ఏర్పాటు



కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

గూడూరు రూరల్: పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వసతులను కల్పించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకుంటామని గూడూరు మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 46 పోలింగ్ కేంద్రాలను సిబ్బందితో కలసి ఆయన పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

టోఫెల్‌తో ఆంగ్ల విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలు



మెమెంటోలను అందజేస్తున్న ఎంఈఓ-2 కాంచన

గూడూరు రూరల్ : టోఫెల్‌తో ఆంగ్ల భాషలో విద్యార్థులు అంతర్జాతీయ ప్రమాణాలను పెంపొందించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రవేశపెట్టిందని గూడూరు ఎంఈఓ-2 కాంచన అన్నారు. మండలంలోని దివిపాళెం కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల విద్యార్థినీవిద్యార్థులకు మంగళవారం స్పెల్లింగ్-బీ జీనియస్-2024 పోటీలను నిర్వహించారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మెమెంటో, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కుమార్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయానికి భారీ రాబడి

చిల్లకూరు: మండల తీర ప్రాంతంలోని తూర్పు కనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయానికి వేలం పాటల ద్వారా రాబడి భారీగా పెరిగినట్లు ఆలయ ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. ఆలయంలో ఏప్రిల్ 1 నుంచి 5 వరకు జరిగే అమ్మవారి జాతర మహోత్సవంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకునే దుకాణాలతో పాటుగా, ఏడాది పాటు నిర్వహించుకునే దుకాణాల వేలం పాటలను మంగళవారం ఆలయ ఆవరణలో నిర్వహించారు. ఆలయ చైర్ పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ మాట్లాడుతూ గత ఏడాది కన్నా ఈ ఏడాది రూ.8.40 లక్షల వరకు ఆదాయం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, ధర్మకర్తల మండలి సభ్యులు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి, ఉప్పల ప్రభాకర్ గౌడ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

గూడూరు రూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని గూడూరు ఎంపీపీ బూదూరు గురవయ్య అన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు యద్దల నరేంద్రరెడ్డి దాతృత్వంతో పట్టణ సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి వై.ఎస్.ఆర్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను మంగళవారం గూడూరు ఎంపీపీ బూదూరు గురవయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కొండూరు సునీల్‌రెడ్డి, కొండల విద్యాసాగర్, ప్రభు అర్ముగం, మురళి, అశోక్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భావనారుషి తిరుణాళ్లు



వెంకటగిరిలో కలశ గ్రామోత్సవం

వెంకటగిరి రూరల్: పద్మశాలీల ఆరాధ్య దైవం శ్రీభద్రావతి భావనారుషి తిరుణాళ్లు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో మంగళవారం తిరుణాళ్లలో భాగంగా కలశ స్థాపన గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక మహిళలు, కుటుంబీకులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఖడ్గమాలికలను వినిపించారు. పట్టణంలోని మల్లమ్మగుడి ప్రాంతంలో భద్రావతి భావనారుషి కల్యాణోత్సవం కనుల విందుగా నిర్వహించారు.

బండ్ల దారి గ్రామకంఠంగా మార్పు

సూళ్లూరుపేట: మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరులో సర్వే నెంబర్ 6-1లో 30.07 ఎకరాల భూమిని బండ్లదారి అని రికార్డుల్లో ఉన్న నివాస స్థలాలను గ్రామకంఠంగా మార్పు చేయించి రిజిస్ట్రేషన్ అయ్యేలా ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు సీఎంఓ నుంచి విడుదల చేసి జీఓను మంగళవారం రాత్రి తీసుకొచ్చారు. అయితే మన్నారుపోలూరులోని శ్రీ అళఘు మల్లారి కృష్ణస్వామి ఆలయం, దేవాంగవీధి, యాదవవీధి, బ్రాహ్మణవీధి, లొక్కువీధి, అల్లూరు సీతారామరాజువీధి, శ్రీకాళహస్తి రోడ్డుకు రెండువైపులా ఉన్న ఇళ్లు, పెద్ద గిరిజనపాళెం కొంతభాగం, దుర్గమ్మ ఆలయం ఉండే వీధిలోని ఇళ్లు అన్నీ 6-1 సర్వేనెంబర్ 30.07 ఎకరాల్లో ఉన్నాయి. ఈ భూమిని ఎప్పుడో రెవెన్యూ అధికారులు బండ్లదారి అని రికార్డుల్లో నమోదు చేశారు. దీంతో ఈ ప్రాంతంలోని ప్లాట్లు, ఇళ్ల రిజిస్ట్రేషన్ కాకుండా 22ఏ లో పొందుపరిచారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావడంతో ఈ తంతు అంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే కిలివేటి విన్నవించడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. బండ్లదారి అని నమోదు చేసివున్న రెవెన్యూ రికార్డుల్లో గ్రామకంఠం అని నమోదు చేయించారు. అయితే ఈ విషయం తెలియగానే బాధితులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే సంజీవయ్యకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

వలంటీర్లు.. సంక్షేమ వారధులు



వలంటీర్లుకు అవార్డులు అందజేస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్



కార్యక్రమానికి హాజరైన వలంటీర్లు

వాకాడు: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వలంటీర్లు సంక్షేమ వారధులుగా నిలిచారని, జగనన్న సైనికులు వీళ్లేనని ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గం సమన్వయకర్త మేరిగ మురళీధర్ అన్నారు. సోమవారం వాకాడులోని ఎన్‌బీకేఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపీడీఓ గోపీనాథ్ అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల సిఫారసు తప్పనిసరి అని, అర్హత కల్గిన నిజమైన పేదలకు మొండి చేయి చూపారన్నారు. ఆ ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో వలంటీర్, సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి కుల, మత, వర్గ, రాజకీయ ప్రమేయం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. ఈ పథకాలను పేద ప్రజలకు నేరుగా అందించి, వలంటీర్ వ్యవస్థకు వన్నె తెచ్చారన్నారు. కరోనా సమయంలో వలంటీర్ సేవలు అమోఘమన్నారు. మండలంలో 241మంది వలంటీర్‌లు ఉండగా అందులో సేవా వజ్ర ఇద్దరికి, సేవా రత్న నలుగురికి, మిగిలిన వారికి సేవా మిత్ర అవార్డులు అందజేశామన్నారు. త్వరలోనే ఎన్నికలు సమీపిస్తున్న వేళ వలంటీర్‌లు వారి పరిధిలోని లబ్ధిదారులకు జగనన్న అందించిన పథకాలను వివరించాలన్నారు. పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ జగనన్ననే సీఎంగా చేసుకోవాలని మురళీధర్ పిలుపినిచ్చారు. అనంతరం ఆయన వలంటీర్లను శాలువాలతో సత్కరించి అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నేతలు జగనన్న ప్రభుత్వం చేస్తున్న మంచిని కొనియాడారు. వైస్ ఎంపీపీ వి.వెంకటరమణయ్య, సర్పంచి వెంకటరత్నమ్మ, నేతలు కె.దామోదర్‌రెడ్డి, డి.అజిత్‌కుమార్‌రెడ్డి, డి.మధురెడ్డి, ఎం.కిరణ్‌రెడ్డి, వెంకటరత్నం, సుధాకర్‌నాయుడు, పి.రాజశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం



పునబాకలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

పెళ్లకూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో అందరికీ సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో సురేష్‌బాబు అన్నారు. మంగళవారం బంగారంపేట గ్రామ సచివాలయ ప్రాంగణంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి పలు ప్రాంతాల నుండి వ్యాధిగ్రస్తులు విచ్చేసి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108, 104 సదుపాయాలతోపాటు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించి ప్రజల ప్రాణాలను కాపాడడంతోపాటు జగనన్న సురక్షతో నిండు జీవితానికి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిస్తున్నట్లు వివరించారు. తొలుత వైద్యులు, వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి వ్యక్తిగత ఆరోగ్య వివరాలను నమోదు చేశారు. వలంటీర్లు, ప్రజాప్రతినిధుల సహకారంతో హెల్త్‌క్యాంపుపై అవగాహన కల్పించి, తద్వారా మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో అన్నపూర్ణరావు, డాక్టర్ సుజాత, కార్యదర్శి మధుమోహన్, నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోటలో జగనన్న ఆరోగ్య సురక్ష

కోట: కోట-2 సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు రూప, మునిశేఖర్, రాధ, శ్రీకాంత్‌లు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 202 మందికి వైద్యపరీక్షలు, మరో 54 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఎంపీడీఓ శంకరయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు వైద్యశిబిరాన్ని పరిశీలించారు.

జగనన్న ఆరోగ్య సురక్షను వినియోగించుకోండి

రాపూరు: జగనన్న ఆరోగ్య సురక్షను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు సూర్యధర్మేంద్ర అన్నారు. రాపూరు మండలం సిద్ధవరం గ్రామంలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఇంటి వద్దే ఉచిత వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎంపీడీఓ గంగయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు మురళీమోహన్‌రెడ్డి, వైద్యులు మధుసూదన్, నజ్మ, గురవయ్య, వలంటీర్లు,స చివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలి



శోభారాణికి కంప్యూటర్ అందిస్తున్న క్రిభ్‌కో అధికారులు

ఓజిలి: రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులు దృష్టి సారిస్తే వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని క్రిభ్‌కో కంపెనీ జిల్లా మార్కెటింగ్ అధికారి పి.మురళీధర్ అన్నారు. కురుగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అధ్యక్షురాలు ఉచ్చూరు శోభారాణి ఆధ్వర్యంలో రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాన్ని 2023-24 సంవత్సరానికి దత్తత తీసుకున్నామన్నారు. దీంతో సేంద్రియంగా తయారయ్యే క్రిభ్‌కో ఎరువుల వాడకంతో జరిగే మేలును రైతులకు తెలియజేశారు. పంట పొలాల్లో మట్టి నమూనా పరీక్షలు చేయించి మట్టిలో ఏ ఎరువులు తక్కువగా ఉన్నాయో వాటిని వాడితే పెట్టుబడి తగ్గి దిగుబడి శాతం పెరుగుతుందన్నారు. అధ్యక్షురాలు శోభారాణి క్రిభ్‌కో సేంద్రియ ఎరువులను రైతులకు పంపిణీ చేశారు. సీఈఓ ఏకాంబరం రవీంద్రయ్య, కార్యదర్శి కృష్ణయ్య, వైఎస్ఆర్ సీపీ నేత ఉచ్చూరు హరనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సహకార సంఘానికి క్రిభ్‌కో ఎరువుల మార్కెటింగ్ అధికారి పి.మురళీధర్ రూ.25 వేల విలువైన కంప్యూటర్‌ను వితరణ చేశారు. ఈ మేరకు అధ్యక్షురాలు శోభారాణికి అందజేశారు.

సమాన న్యాయం అందించడమే లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి మురళీధర్

గూడూరు రూరల్: ఆడ, మగ తారతమ్యాలు లేకుండా అందరికీ సమాన న్యాయం అందించడమే సామాజిక న్యాయ దినోత్సవ లక్ష్యమని సీనియర్ సివిల్ జడ్జి సి.మురళీధర్ అన్నారు. గూడూరులోని కోర్టు ప్రాంగణంలో మంగళవారం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మురళీధర్ మాట్లాడుతూ సమాజంలో ఆడ, మగ బేధాలు లేకుండా వేతనం(కూలీ) సమానంగా అందించాలని సూచించారు. పేదలకు చట్టాలపై అవగాహన కల్పించాలని కోరారు. లోక్ అదాలత్ ద్వారా వివిధ రకాల కేసులను రాజీ చేసుకునే వీలుందని, మార్చి 9వ తేదిన జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు అరవ పార్వతయ్య, మహబూబ్‌బాషా, కక్షిదారులు, వలస కూలీలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రెండు మోటార్ బైక్‌లు చోరీ

నాయుడుపేట టౌన్: పట్టణంలో రెండు మోటార్ బైక్‌లు చోరీకి గురైన విషయాన్ని మంగళవారం ఉదయం బాధితులు గుర్తించారు. స్థానికులు, బాధితులు తెలిపిన మేరకు పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఇంటి ముందు నిలబెట్టి ఉన్న పల్సర్ మోటార్ బైక్‌ను సోమవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి చాకచాక్యంగా మారు తాళాలతో చోరి చేశాడు. బైక్ చోరీకి పాల్పడుతున్న వైనాన్ని సమీపంలోని శరవణ సూపర్ మార్కెట్ వద్ద సీసీ కెమెరాల్లో నమోదై ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. చోరీకి గురైన పల్సర్ బైక్ పోలీస్ కానిస్టేబుల్‌ది కావడం విశేషం. పట్టణంలోని సీఎస్ తేజ సెంటర్ వద్ద ఆదే తరహాలో మరొక బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయడాన్ని బాధితుడు మహేష్ గుర్తించారు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి చోరీలను నివారించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలలో విద్యార్థుల మాక్ పోలింగ్

గూడూరు రూరల్: విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియ, పోలింగ్ నిర్వహణపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో పట్టణంలోని దర్గావీధిలో ఉన్న జెమ్స్ పాఠశాలలో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి పౌరుడి కర్తవ్యమన్నారు. ఈ మాక్ పోలింగ్‌లో విద్యార్థిని, విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు యల్లయ్య, వాసు, రాఘవయ్య, మస్తాన్‌బీ, నజీరా, మంజుల, హరిత, గౌరీ, తదితరులు పాల్గొన్నారు.

24 మద్యం బాటిళ్లు స్వాధీనం

గూడూరు రూరల్: మేకనూరు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన ఏడుకొండలును అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 24 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేపు ఆసరా చెక్కులు పంపిణీ

చిల్లకూరు: రాష్ట్ర ప్రభుత్వం పొదుపు మహిళలకు అందించే వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం చిల్లకూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఎంపీడీఓ భానుమూర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆసరా పథకం చెక్కులు ఉదయం పంపిణీ చేస్తారని, అలాగే మధ్యాహ్నం రెండు గంటలకు ఉత్తమ సేవలు అందిస్తున్న వలంటీర్లకు పురస్కారాలను అందిస్తారని తెలిపారు.

వైఎస్ఆర్ సీపీ జెండా ఎగరేయాలి



ఆచారులకు ఫ్యాన్లు పంపిణీ చేసిన కిలివేటి సుభాషిణి, వైఎస్ఆర్ సీపీ నాయకులు

నాయుడుపేట టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్ఆర్ సీపీ విజయకేతనం ఎగుర వేసేందుకు సిద్ధం కావాలని మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక ఎంపీపీ ధనలక్ష్మి పిలుపునిచ్చారు. సాయిబాబా సా మిల్లు వద్ద మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. వడ్రంగి పని చేసే ఆచారులకు 80 మందికి సామిల్లు యజమాని సురేష్ వైఎస్ఆర్ సీపీ గుర్తు సీలింగ్ ఫ్యాన్లను అందజేశారు. ఎమ్మెల్యే సంజీవయ్య సతీమణి, మాజీ మంత్రి పసల పెంచలయ్య కుమార్తె కిలివేటి సుభాషిణి, కిలివేటి సౌజన్య చేతుల మీదుగా ఫ్యాన్లను పంపిణీ చేశారు. డీఎల్‌పీఓ రవీంద్ర, కలికి మాధవరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చదలవాడ కుమార్, గోపాల్‌రెడ్డి, మీరా రెడ్డి, హరినాథ్‌రెడ్డి, కె.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం



మాట్లాడుతున్న మాధవిరెడ్డి

వెంకటగిరి రూరల్: త్వరలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని ఆ పార్టీ తిరుపతి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మాధవిరెడ్డి పేర్కొన్నారు. వెంకటగిరి పట్టణంలోని నేదురుమల్లి నివాసం వద్ద ఎన్‌జేఆర్ భవనంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రంలో సీఎంవైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయన్నారు. తిరుపతి పార్లమెంట్ పరిధిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. మహిళా విభాగం కార్యదర్శి కాటూరు రామతులసి, గొట్టికాటు సర్పంచ్ వెందోటి సుప్రజ, పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, నాయకులు కాటూరు ప్రసాద్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నేదురుమల్లికి ఘననివాళి



నేదురుమల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

సైదాపురం(వెంకటగిరి): వెంకటగిరి నియోజకవర్గంలో తన తండ్రి దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ఎన్నో శాశ్వతమైన అభివృద్ధి పనులు చేసి, ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయారని అదే స్ఫూర్తితో తాను మరింత అభివృద్ధికి కృషి చేస్తానని వైఎస్ఆర్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 89వ జయంతి పురస్కరించుకుని వెంకటగిరిలో పలుసేవా కార్యక్రమాలు చేపట్టారు. తొలుత నేదురుమల్లి నివాసంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆయన సతీమణి స్వప్నరెడ్డి, కుమార్తె అలేఖ్యరెడ్డిలతో జనార్దన్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని త్రిభువని సెంటర్ వద్ద ఉన్న జనార్దన్‌రెడ్డి విగ్రహం వద్ద వద్ద భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్‌సీ వైద్యశాలలో రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు.

నేదురుమల్లి సేవలు మరువలేనివి...

వెంకటగిరి రూరల్: దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చేసిన సేవలు మరువలేనివని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి తెలిపారు. వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో మంగళవారం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. వైఎస్ఆర్ సీపీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దొంతు శారద, వైఎస్ఆర్ సీపీ పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, చెలికం శంకర్‌రెడ్డి, చిట్టేటి హరికృష్ణ, ఎల్.కోటేశ్వరరావు, వెందోటి కార్తీక్‌రెడ్డి, రామతులసి, రావెళ్ల వెంకటకృష్ణమనాయుడు, రమేష్‌రెడ్డి, పి.రామారావు, ఎస్దాని బాషా, దశరథరామిరెడ్డి, తోట గణేష్‌రెడ్డి, నారాయణ, మురళి, పి.శ్రీనివాసులు, భాస్కర్, వలికల కృష్ణయ్య, కూనా మల్లికార్జున్ పాల్గొన్నారు.

కోట:మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యానగర్ ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలోని నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో మెగా రక్తదాన శిబిరం చేపట్టారు. ఎమ్మెల్సీ, వైఎస్ఆర్ సీపీ గూడూరు సమన్వయకర్త మేరిగ మురళీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొడవలూరు భక్తవత్సలరెడ్డి, నాగూర్‌రెడ్డి, షణిల్‌రెడ్డి, విజయసారథిరెడ్డి, శ్రీహరిరెడ్డి, పరంధామరెడ్డి, వజ్జా రామచంద్రారెడ్డి, విజయకుమార్‌రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా జనార్దన్‌రెడ్డి జయంతి

వాకాడు: దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 89వ జయంతి వేడుకలను మంగళవారం వాకాడులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్దన్‌రెడ్డి సతీమణి, మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, నేదురుమల్లి అభిమానులు, భారీ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

రాపూరులో...

రాపూరు: మూడు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన శిబిరంలో నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి చిత్రపటానికి వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు పాపకన్ను దయాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కలువాయి: నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి జయంతి వేడుకలను కలువాయి వైఎస్ఆర్ సీపీ కార్యాలయంలో నిర్వహించారు. జెడ్పీటీసీ బి.అనిల్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ ఆర్.లక్ష్మీదేవి, ఎంపీ కృష్ణారెడ్డి, చల్లా సుబ్బరామిరెడ్డి, బి.రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.



విద్యానగర్‌లో నేదురుమల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్



నేతలతో కలసి కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి

నేడు వలంటీర్లకు వందనం

రాపూరు: మండలంలోని అన్ని సచివాలయాల్లో పనిచేస్తున్న వలంటీర్లకు బుధవారం 3 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగయ్య తెలిపారు. వలంటీర్లు అందించిన సేవలకు సేవావజ్ర, సేవామిత్ర, సేవారత్న పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. వైఎస్ఆర్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారాలు అందించనున్నారు.

రికార్డులు నిర్వహణ పక్కాగా ఉండాలి

ఓజిలి: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు సంబంధించిన రికార్డులు పక్కాగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజన అన్నారు. ఓజిలి బీసీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రాలలో స్టాక్, గుడ్లు, బియ్యం తదితర అన్ని రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు. తల్లీబిడ్డల ఆధార్ సీడింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

నేడు వడ్ల మోపూరులో ఉచిత వైద్య శిబిరం

దక్కిలి: మండలంలోని వడ్ల మోపూరు గ్రామంలో కరుణామయి చారిటబుల్ హస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ విజయభారత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. బుధవారం ఉదయం 10 గంటలు నుండి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో ఎముకలు, కీళ్లు, దంత సమస్యలు, చెవి, ముక్కు, గొంతు వ్యాధులకు వైద్య సేవలు అందించేందుకు వైద్య నిపుణులు రానున్నారని ఈ ప్రకటనలో తెలిపారు.

ఓటరు జాబితా సరిచూసుకోవాలి

నాయుడుపేట టౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఓటర్ల జాబితాలలో ఎక్కడ పొరపాట్లు లేకుండా పక్కాగా సరిచేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి సూచించారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం బీఎల్‌ఓలతో కమిషనర్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని 37 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఉండేలా చూడాలన్నారు. బీఎల్‌ఓలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని కమిషనర్ హెచ్చరించారు. మున్సిపల్ మేనేజర్ ఎంకే ఖాజామొహిద్దీన్, ఆర్.షేక్ షాజహాన్ ఉన్నారు.

పనులకు ఆటంకం కలిగించొద్దు

చిల్లకూరు: తీర ప్రాంతంలోని తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో ఉన్న ఏపీఐఐసీ భూముల్లో చేపట్టే పనులకు ఎలాంటి ఆటంకాలు కలిగించవద్దని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. మండల తీర ప్రాంతంలోని తీగపాళెం సమీపంలో ఉన్న బకింగ్‌హాం కెనాల్ ప్రాంతంలో జరుగుతున్న పనులను సోమవారం స్థానికులు అడ్డుకున్న విషయం తెలిసిందే. దీంతో మంగళవారం లింగవరం, తమ్మినపట్నం, గుమ్మళ్లదిబ్బ, మన్నెగుంట, నర్రావారిపాళెం, పల్లెవానిదిబ్బ గ్రామాలకు చెందిన స్థానికులతో రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా స్థానికులు అధికారులతో మాట్లాడుతూ తమకు పరిహారం ఇప్పించాలని పట్టుబట్టారు. అధికారులు స్థానికులతో మాట్లాడుతూ ఈ భూముల్లో పలు పరిశ్రమలు వచ్చే అవకాశం ఉన్నందున ఏపీఐఐసీ వారు అభివృద్ధి పనులు చేపడుతున్నారని వీటికి ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని అన్నారు. పరిహారం విషయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు. లింగవరం, తమ్మినపట్నం, మన్నెగుంట సర్పంచ్‌లు నెల్లిపూడి సుబ్రహ్మణ్యం, ఏడకొండలు, నాసిన సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

నాయుడుపేట: మండల పరిధిలోని అన్నమేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2015-16 సంవత్సరం 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యాక్రమం మంగళవారం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం మధుసూదనరావు అధ్యక్షతన పూర్వ ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సత్కరించి గురు భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగు ఉపాధ్యాయుడు, ప్రస్తుతం పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ చిగురువాడ పద్మనాభం పాల్గొని, పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అప్పటి గురువులైన జ్యోతికుమార్, కె.సుబ్రహ్మణ్యం, కె.చంద్రశేఖర్, పెంచలయ్య, రమేష్‌బాబు, రాజశేఖర్, మునిశేఖర్, సుబ్బారావులకు పూర్వ విద్యార్థులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. పదోతరగతి విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. అత్యధిక మార్కులు సాధిస్తున్న విద్యార్థులకు బహుమతులను అందించారు. పాఠశాల అభివృద్ధి కోసం రూ.10 వేలు విరాళాన్ని అందజేశారు.

అంగన్‌వాడీ ఆయాలకు అవగాహన

కలువాయి: అంగన్‌వాడీ సెంటర్లలో పనిచేసే ఆయాల విధి నిర్వహణపై మంగళవారం కలువాయి వెస్ట్ పాఠశాల కేంద్రంలో అవగాహనా కార్యక్రమాన్ని ఐసీడీఎస్ అధికారులు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రానికి వచ్చే పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని, ఇళ్లకు పంపకూడదని సూచించారు. సూపర్‌వైజర్లు రాజేశ్వరమ్మ, పద్మ, అన్ని కేంద్రాల ఆయాలు పాల్గొన్నారు

ఉపాధ్యాయురాలి ఆకస్మిక మృతి

కలువాయి: కలువాయి మండలం వెంకటరామరాజుపేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న వి.లలితమ్మ మృతికి బద్దెవోలు కాంప్లెక్స్ హెచ్‌ఎం వల్లూరు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు. లలితమ్మ సోమవారం బద్దెవోలు కాంప్లెక్సు సమావేశానికి వెళ్లి తిరిగి వస్తూ అస్వస్థతకు గురై మృతి చెందింది. ఈ నేపథ్యంలో పలువురు ఉపాధ్యాయులు ఆమెకు సంతాపం తెలిపారు.